క్లుప్తంగా

బండి తిరగబడి ఎద్దు మృతి



ఎద్దును పరిశీలిస్తున్న రైతులు

పుట్టపర్తి టౌన్: బండి తిరగబడి ఎద్దు మృతి చెందిన సంఘటన కొత్తచెరువు చెరువులో చోటు చేసుకొంది. రైతు తెలిపిన మేరకు.. కొత్తచెరువు గ్రామానికి చెందిన గూడా వెంకటరాముడు ఎద్దుల బండి సహాయంతో బాడుగ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం వ్యవసాయం పనులు ముగించుకొని ఎద్దులకు నీళ్లు తాపడానికి చెరువులోకి బండి దింపారు. గుంతలోకి దిగడంతో బండి తలకిందులైంది. తాడు గొంతుకు బిగుసుకోవడంతో నీళ్లు ఎక్కువ తాగి ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. మరొక ఎద్దుకు ఉన్న పట్టుడుతాడు విప్పడంతో అది ప్రాణాలతో బయటపడింది. జత ఎద్దులు లక్ష అరవై వేలకు కొనుగోలు చేశామని, ఎద్దు మరణించడంతో 80 వేల వరకూ నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. ఎద్దు కళేబరం వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.

పాఠశాల తనిఖీ

బత్తలపల్లి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను శనివారం జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తాగునీటి శుద్ధి జలాల ప్లాంట్ (ఆర్‌ఓ) పని చేయకపోవడం పట్ల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చెప్పినా వినలేదు, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చెప్పినా వినడం లేదంటే ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చునంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదులను ఆమె పరిశీలించారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రమణారెడ్డి

నల్లచెరువు: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ రమణారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన, ఎంపీడీఓ శకుంతల, తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సై వరలక్ష్మి తీరుపై జిల్లా ఎస్పీ మాధవ రెడ్డికి ఫోన్ ద్వారా ఎంపీపీ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణస్వామి, మేజర్ పంచాయతీ సర్పంచ్ పంచరత్నమ్మ, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు జీన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: ఉప సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటి గోపీనాథ్, రేణుక దంపతుల కుమారుడు కోటి హేమనందన్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం ధర్మవరం మండలం గోట్లూరు అనాథ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సరయు, యస్వంత్, కోటి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

బత్తలపల్లి: రాష్ట్రంలో ఇటీవల బదిలీలు, పదోన్నతులు పొందిన వారి జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందంటూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు నాగరాజు, అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి నాగశేషణ, జిల్లా కౌన్సిలర్లు నాగేశ్వరయ్య, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు

కదిరి టౌన్: అనుమతి లేకుండా ధర్నా చేపట్టిన టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ మగ్బుల్‌బాషా తెలిపారు. స్థానిక ఇందిరాగాంధీ సర్కిల్‌లో శుక్రవారం కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట ప్రసాద్ ఆధ్వర్యంలో 23 మంది ధర్నా చేపట్టారన్నారు. దీనిపై 151 సెక్షన్ కింద కందికుంటతో సహా అతని అనుచరులు 23 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

- భర్త సోమశేఖర్ వేధింపులు తాళలేక కదిరి పట్టణంలోని గజ్జలరెడ్డిపల్లికి చెందిన శ్యామల శనివారం సూపర్‌వాజ్‌మాల్ తాగింది. చుట్టుపక్కల వారు గమనించి కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు.

విధ్వంసానికి చంద్రబాబు కుట్ర

- సీఎం జగన్‌ను చూస్తే ఆయనకు నిద్ర పట్టడం లేదు
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



టీడీపీ నాయకుల విధ్వంస కాండను వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను ఓర్వలేక ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు విధ్వంస కాండ సృష్టించారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో చంద్రబాబునాయుడు కుట్రలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు, అన్నమయ్య జిల్లాలలో చంద్రబాబు పక్కా స్కెచ్‌తోనే విధ్వంసానికి కుట్ర పన్నారన్నారు. అంగళ్లు మీదుగా చిత్తూరు జిల్లాలోని పుంగనూరు బైపాస్, పలమనేరు మీదుగా చంద్రబాబు చిత్తూరుకు చేరుకోవాల్సి ఉండగా రూట్‌మ్యాప్‌లో ప్రస్తావనే లేని పుంగనూరుకు వెళ్లి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి అప్పటికే సిద్ధం చేసుకున్న ఇనుప రాడ్లు, బీరు బాటిళ్లు, రాళ్లు విసురుతూ పోలీసులపై దాడి చేయించారన్నారు. పోలీస్ వాహనాలను సైతం ధ్వంసం చేసి టీడీపీ కార్యకర్తలు సెల్ఫీలు దిగడం చూస్తుంటే ఎంతకి దిగజారారో అర్థం అవుతుందన్నారు. 'కొడకల్లారా రండిరా చూసుకుందాం' అంటూ వ్యాఖ్యలు చేసి అమాయకులైన కార్యకర్తలను రెచ్చగొట్టారన్నారు. బాబు మాటలు విని విధ్వంసాలకు దిగితే భవిష్యత్ అంధకారం అవుతుందని హితవు పలికారు. గతంలో ఏ ఒక్క ప్రాజెక్ట్‌ను చంద్రబాబు నిర్మించలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హంద్రీనీవా ప్రాజెక్ట్‌ను దాదాపు పూర్తి చేస్తే అరకొర పనులు చేసి పబ్లిసిటీ చేసుకున్న నీచుడు చంద్రబాబు అన్నారు. పోలీసులపై దాడులు జరిపి బ్లాక్ మెయిల్ పద్ధతిలో చెప్పుచేతుల్లో పెట్టుకోవాలని స్కెచ్ వేశారని, పోలీసులపై వరుసగా జరుగుతున్న దాడులే ఇందుకు నిదర్శనమన్నారు. గతంలో టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పోలీసులు తినడానికే వచ్చారని అనుచిత వ్యాఖ్యలు చేయడం, మరో టీడీపీ నేత జేసీ దివాకర్‌రెడ్డి తాము అధికారంలోకి వచ్చాక తమ బూట్లు నాకే పోలీసులకు పోస్టింగ్‌లు ఇస్తామని చేసిన వ్యాఖ్యలను మీడియాకు వినిపించారు. నారా లోకేష్ సైతం ఎక్కువ కేసులున్న వారికి టీడీపీలో పదవులు ఇస్తామని చెప్పడం, రౌడీషీటర్లకు నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పడం చూస్తే విస్మయం కలుగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేకే కుట్రలు చేస్తున్నారని, దిగజారుడు రాజకీయాలు చేయకూడదని టీడీపీ నాయకులకు హితవు పలికారు. విధ్వంస కాండకు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి

శివారు కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే కేతిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 19వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నిర్వహించారు. తన మనవడికి 'విద్యాదీవెన' పడలేదని ఓ వృద్ధురాలు ఎమ్మెల్యేకు విన్నవించింది. స్పందించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి.. సచివాలయ సిబ్బందిని పిలిచి డబ్బులు అకౌంట్‌లో పడ్డాయా లేదా అని విచారించారు. బ్యాంకులోకి వెళ్లి స్టేట్‌మెంట్ తీసుకోవాలని వృద్ధురాలికి సూచించారు. ఇంటి పట్టా మంజూరైనా, ఐడీ వేరేవాళ్లది చూపుతోందని ఓ మహిళ ఎమ్మెల్యేకు విన్నవించింది. పట్టా మంజూరైనా, బిల్లులు పడలేదని ఓ మహిళ చెప్పడంతో ఇల్లు కట్టలేదని రిజర్వులో పెట్టారని సచివాలయ సిబ్బంది తెలిపారు. మరోసారి పట్టా వచ్చేలా చూడాలని ఎమ్మెల్యే హౌసింగ్ ఏఈ బాలాజీని ఫోన్‌లో ఆదేశించారు. బిల్లులు వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ బండి శేషన్న, వార్డు కౌన్సిలర్ కేశగాళ్ల కృష్ణవేణి, వార్డు ఇన్‌చార్జ్ కేశగాళ్ల కిష్ట తదితరులున్నారు.

క్రీడలతో చదువులోనూ రాణింపు



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

నల్లమాడ: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలిగి విద్యార్థులు చదువులో బాగా రాణిస్తారని వక్తలు పేర్కొన్నారు. ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నల్లమాడ ఉన్నత పాఠశాల మైదానంలో ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు ఏరియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు, ఆర్‌డీటీ కదిరి రీజనల్ కో ఆర్డినేటర్ శాంతమ్మ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థినుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీ శాంతమ్మ తెలిపారు. 100, 200, 400 మీటర్ల పరుగు పందేలు, 100ఇన్‌టు4 రిలే, లాంగ్ జంప్, షాట్‌పుట్ క్రీడా పోటీలు నిర్వహించి ఆయా విభాగాల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు లక్ష్మీపతినాయక్, అనురాధ, కోచ్ పృథ్వీ, ఆర్‌డీటీ ఏరియా సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

గాండ్లపెంట: విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ఎంఈఓ క్రిష్టానాయక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో గాండ్లపెంట, ఎన్‌పీకుంట కేజీబీవీ పాఠశాలలు, 6 ఉన్నత పాఠశాలలకు చెందిన 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే బాలికలు అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు. 9 మంది బాలికలు గోల్డ్‌మెడల్‌లు సాధించి ఈ నెల 26 నుంచి 29 వరకు అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఏటీఎల్ క్రిష్టా తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, ముంతాజ్ అలీ ఆర్డీటీ ఎస్‌టీఎల్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, పీడీలు పాపారాయుడు, హారున్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జిల్లాలు దాటిన వలంటీర్ సేవలు



లక్ష్మీదేవికి బయోమెట్రిక్ వేయించి పింఛన్ అందిస్తున్న వలంటీర్ గణేష్



తిరుపతిలో నరసింహా రెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహేష్ రెడ్డి

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అనారోగ్యంతో 15 రోజులుగా తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకొన్న వలంటీర్ మహేష్‌రెడ్డి శనివారం తిరుపతికి చేరుకొని పింఛన్ సొమ్ము అందజేశారు. అదే గ్రామానికి చెందిన విజయశాంతి అనార్యోగంతో అనంతపురం సవేర ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. దీంతో వలంటీర్ అపర్ణ శనివారం ఆసుపత్రికి చేరుకొని పింఛన్ సొమ్ము అందజేశారు. పింఛన్ తీసుకొన్న వృద్ధులు వలంటీర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్పీకుంట: వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ముంగిటకే చేరుతున్నాయి. లబ్ధిదారులు సుదూర ప్రాంతాలలో ఉన్నా, లేక అనారోగ్యంతో బాధపడుతూ ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లోని ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నా వలంటీర్లు వారి వద్దకు వెళ్లి పథకాలు అందజేస్తున్నారు. ఈ క్రమంలోనే మండల కేంద్రంలోని సాయిరాం వికలాంగుల కాలనీకి చెందిన లక్ష్మీదేవి 29 రోజులుగా అనారోగ్యం (గర్భసంచి సమస్య)తో బాధపడుతూ తిరుపతి లోని మెటర్నిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ గణేష్ తన సొంత ఖర్చుతో తిరుపతికి వెళ్లి సామాజిక భద్రతా పింఛన్ సొమ్మును అందజేశాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వలంటీర్ సేవలను కొనియాడారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కోటి బాబు

బత్తలపల్లి: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం తిరుపతి నుంచి అనంతపురం రోడ్డు మార్గాన వస్తున్న విషయం తెలుసుకున్న ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బత్తలపల్లి కూడలిలో మంత్రి కాన్వాయ్ నిలిపి పార్టీ నాయకులతో మాట్లాడారు. నాయకులు మంత్రికి శాలువాకప్పి పూలబొకేను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, పార్టీ నేతలు కోటి వీరనారప్ప, బండి నాగభూషణ, కమతం శంకర్, కుమ్మర వెంకటరమణ, ముసలప్ప, సాకే గోపాల్, ఈడిగ క్రిష్టా, వెల్డింగ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువులో..

నల్లచెరువు: రాష్ట్ర గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లచెరువు వద్ద ఘన స్వాగతం పలికారు. కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డితో పాటు మంత్రిని శాలువలు, పుష్పగుచ్ఛాలు, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తల వెంకటరమణ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, నాయకులు రామాంజనేయులు, ఉత్తన్న, నజీర్, శ్రీధర్‌రెడ్డి, రమణ, దొడ్డెప్ప, శేఖర్ రెడ్డి, రామచంద్ర, కె.శ్రీనివాసులు, బావాఖాన్, బాబూరెడ్డి, టైలర్ రామాంజి పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ర్యాలీ

కదిరి అర్బన్: మండల పరిధిలోని ఈ కొత్తపల్లిలో శనివారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త అమరావతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఎంతో ఆరోగ్యం కలిగిస్తుందన్నారు. తల్లిపాలు బిడ్డకు ప్రకృతి ఇచ్చిన వరమన్నారు. తల్లీబిడ్డ మానసికంగా శారీరకంగా దగ్గరవుతారని చెప్పారు. కొందరు లేనిపోని అపోహలు కల్పిస్తున్నారని, లాంటివి నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో పలువురు చిన్నారుల తల్లులతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రెడ్లు, పాలు పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం రోటరీక్లబ్ సభ్యులు గర్భవతులు, బాలింతలకు పాలు, బ్రెడ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, సభ్యులు శివయ్య తదితరులు రోగులకు పాలు, బ్రెడ్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తమ వంతు సహాయం అందిస్తున్నామని తెలిపారు. తల్లిపాలతోనే బిడ్డకు రోగనిరోధకశక్తి వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చీరల తయారీ వ్యాపారుల సంఘ అధ్యక్షుడిగా రవి



గిర్రాజు రవిని సన్మానిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: పట్టుచీరల తయారీ వ్యాపారుల సంఘం అధ్యక్షుడిగా గిర్రాజు రవిని ఎన్నుకున్నారు. పట్టణంలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి గిర్రాజు రవి, చింతా బాలకృష్ణలు పోటీపడ్డారు. సభ్యత్వం ఉన్న వారితో ఓట్లు వేయించగా గిర్రాజు రవికి 169 ఓట్లు పడ్డాయి. చింతా బాలకృష్ణకు 148 ఓట్లు వచ్చాయి. 21 ఓట్ల తేడాతో గిర్రాజు రవి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గిర్రాజు రవిని తోటి వ్యాపారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రవి మాట్లాడుతూ పట్టుచీరల తయారీ వ్యాపారస్తుల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. వ్యాపారులపై దాడులు జరగకుండా ఐకమత్యంగా ఉండేలా చూస్తానని తెలిపారు. త్వరలో కమిటీ సభ్యులను ఎంపిక చేసి వ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు.

సంపూర్ణ పోషణతో మెరుగైన ఆరోగ్యం



పుట్టపర్తిలో కిట్లను పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న

రామగిరి : సంపూర్ణ పోషణతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమేష్ తెలిపారు. శనివారం మండలంలోని కుంటిమద్ది, పీఆర్ కొట్టాల గ్రామాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బాలంతలు, గర్భిణులకు అందించారు. వారు మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో రక్తహీనత, మాతాశిశుమరణాలు ఉంటాయన్నారు. రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటీషన్ డైరెక్టర్ సరళ, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, నాయకులు రామాంజనేయులు, ఓబిలేసు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాభవాని నాయకులు ఉన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మున్సిపాలిటీలోని ఒకటి, నాలుగు, ఐదో వార్డులలో బాలింతలు, గర్భిణులకు ఆయా వార్డుల ప్రజా ప్రతినిధులు, అంగన్‌వాడీ, ఆశా వర్కలతో కలసి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఒకటో వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, సిబ్బందితో కలసి పంపిణీ చేశారు. నాలుగు, ఐదో వార్డుల పరిధిలోని కుమ్మరపేటలో కౌన్సిలర్లు సూర్యాగౌడ్, చెరువు భాస్కర్‌రెడ్డి తదితరులు కిట్లు అందజేశారు

సద్వినియోగం చేసుకోవాలి

పుట్టపర్తి టౌన్: పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ రేణుక పేర్కొన్నారు. శనివారం కొత్తచెరువు బీసీ కాలనీలో వైఎస్సార్ సంపూర్ణ కిట్ల ద్వారా టేక్ హోం రేషన్ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వాల్మీకి శంకర్, ఎల్లప్ప, ఆరోగ్య విస్తరణ అధికారి లాలూనాయక్, పీహెచ్‌ఎన్ రామలక్ష్మమ్మ, ఏఎన్‌ఎం పరిమళ, అంగన్‌వాడీ టీచర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మలకవేమల క్రాస్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అశ్రిత, డాక్టర్ శంకర నారాయణ రాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లండన్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాస్ శంకర్, డాక్టర్ సురేఖ రోగులకు వైద్య చికిత్సలు అందించారు. వంద మందికిపైగా హాజరై పలు రకాలు పరీక్షలు చేయించుకున్నారు. గర్భిణులకు డాక్టర్ సురేఖ వైద్య పరీక్షలు చేసి సూచనలు అందించారు. ఉచితంగా మందులను అందించారు. డాక్టర్ శంకర నారాయణరాజు కూతురు, కుమారుడు లండన్‌ను నుంచి వచ్చి సేవలు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర నాయక్, డాక్టర్ లక్ష్మీ, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డెమో ద్వారా వైద్యులకు అవగాహన

జిల్లాలోని వైద్యాధికారులకు వైద్య చికిత్సలపై లండన్‌కు చెందిన వైద్యులు పలు చికిత్సలపై అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీనివాసశంకర్, డాక్టర్ సురేఖలు డిజిటల్ స్క్రీన్‌పై సులభతర వైద్యం ఎలా చేయాలో వివరించారు. గుండె నొప్పి వచ్చిన వారికి అత్యవసర వైద్యం అందించాలనే వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, తదితరులు హాజరయ్యారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థినులతో పాఠశాల ఎస్‌ఓ, పీఈటీ

ఎన్పీకుంట: బాలికల అథ్లెటిక్ పోటీలలో పతకాలు సాధించిన స్థానిక కేజీబీవీ విద్యార్థినులను ఎస్‌ఓ సునితాకుమారి, సిబ్బంది అభినందించారు. గాండ్లపెంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఏరియా బాలికల అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక



నిత్య



శారద

కదిరి అర్బన్: వెంకటగిరిలో ప్రారంభమైన దక్షిణ మండల అండర్ -15 బాలికల అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు కదిరి పట్టణంలోని సాధన పాఠశాల విద్యార్థినులు నిత్య, శారద ఎంపికయ్యారు. ఇటీవల అనంతపురంలో జరిగిన ప్రాబబుల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు వీరిని ఎంపిక చేశారు.

నులి పురుగులను నివారిద్దాం

తాడిమర్రి: మాత్రలు పంపిణీ చేసి విద్యార్థుల్లో నులిపురుగులు నివారిద్దామని ఎంఈఓ కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కృష్ణప్రసాద్ అధ్యక్షతన ఉపాధ్యాయులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం పురస్కరించుకుని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత సక్రమంగా పాటించకపోవడంతో విద్యార్థుల్లో నులిపురుగులు పడుతాయన్నారు. దీంతో రక్తహీనత, మానసిక లోపాలు కలుగుతాయన్నారు. అనారోగ్యానికి గురై చదువుపై సక్రమంగా దృష్టి పెట్టలేకపోవడంతో చదవలేకపోతారన్నారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి మాత్రలు వేసుకునేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సెకండ్ ఎంఈఓ వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు అరుణ, ఎంపీఈఓ మనోహర్, సూపర్‌వైజర్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

పుట్టపర్తి టౌన్: నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆర్యోగం లభిస్తుందని డాక్టర్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఆల్‌బెండజోల్ మాత్రలను శనివారం బుక్కపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీడీఓలకు, ఎంఈఓలకు సిబ్బందికి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 10న పాఠశాలలో విద్యార్థులకు అందించాలన్నారు. సమన్వయంతో సాగి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

సంక్షిప్త సమాచారం

వేతనాలు చెల్లించాలని వినతి

నల్లమాడ: వేతనాలు చెల్లించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వెంకట్రామిరెడ్డి, నరసింహుడు, రవిశంకర్ తదితరులున్నారు.

ధర్మవరం అర్బన్: బదిలీలు, ప్రమోషన్‌లు పొందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బీకే ముత్యాలప్ప, జిల్లా కార్యదర్శి సానె రవీంద్రరెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాగేశ్వరిలు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందించారు.

నేడు ప్రమాణ స్వీకారం

తాడిమర్రి: స్థానిక సొసైటీ కార్యాలయంలో ఆదివారం జరగనున్న సొసైటీ అధ్యక్షుని ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి హాజరు కానున్నట్లు సొసైటీ సీఈఓ దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. దాడితోట గ్రామానికి చెందిన వైటీ చంద్రశేఖర్ రెడ్డిని సింగిల్‌విండో అధ్యక్షునిగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. ఆదివారం ప్రమాణ స్వీకారోత్సవం జరగనుంది.

అడ్మిషన్లు పెంచాలి

కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠంలో ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లు పెంచాలని జిల్లా విద్యాపీఠం అధికారి లాజర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమన్వయకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి, మల్లికార్జున, వెంకటాచలంతో పాటు పలువురు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

అమడగూరు: ఓడీ చెరువు మండలం బాబా సాహెబ్‌పల్లి గ్రామ శివార్లలో శనివారం తెల్లవారుజామున నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గోపి పేర్కొన్నారు. రూ. 45,300 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

అమడగూరు: ఓడీ చెరువు మండలం నాయనకోట తండా సమీపంలో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సారా కాచే వ్యక్తి నాయనకోట తండాకు చెందిన వ్యక్తిగా గుర్తించామని, అతడు పరారీ అయినట్లు పేర్కొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

అమడగూరు: మహమ్మదాబాద్‌కు చెందిన విద్యార్థిని జాస్మిన్(20) అదృశ్యం కావడంపై తండ్రి అల్లాబకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. 3 వ తేదీ తెల్లవారుజామున 2 గంటల నుంచి కనబడటం లేదని పేర్కొన్నట్లు తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

అమడగూరు: అమడగూరు ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన పలువురు ఉపాధ్యాయులను శనివారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన హెచ్‌ఎంలు రమణ, చెన్నకేశవకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది రామాంజినేయులు, పీడీ గోపీనాథ్, అజాద్‌ను దుశ్శాలువలతో సత్కరించారు. హెచ్‌ఎం శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

గ్రామంలోనే లావాదేవీలు

పుట్టపర్తి: బుక్కపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోనే ఇకపై బ్యాంకు లావాదేవీలను కొనసాగించుకోవచ్చని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏపీజీబీ సౌజన్యంతో గ్రామ పంచాయతీకి మినీ బ్యాంకు (బీపీ) నిర్వాహకుడిగా బత్తిని కిష్టయ్యను ఏర్పాటు చేశారు. సర్పంచ్ గోవిందరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.